

సత్యసాయి రథోత్సవం

వైభవంగా సత్యసాయి నారాయణ రథోత్సవం

- సామూహిక శ్రీసాయి సత్యనారాయణ వ్రతాలు
- వేలాదిగా హాజరైన భక్తులు..
- పులకించిన పుట్టపర్తి



బంగారు విగ్రహం



పర్తి వీధులలో చిన్నారి దేవతలు

వెండి రథంపై

బంగారు సాయి



పుట్టపర్తి, టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. సాయికుల్వంతులో వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీసాయి సత్యనారాయణ సామూహిక వ్రతాలను నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పుట్టపర్తిలో మంగళవారం అశేష భక్తులనడుమ సత్యసాయి నారాయణ రథోత్సవం జరిగింది. సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి స్వర్ణ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ విగ్రహాన్ని, వేణుగోపాలస్వామి, సీతారాముల ఉత్సవ మూర్తులను గోపురం వద్దకు తోడ్కొని వచ్చి వెండి రథంపై కొలువుదీర్చారు. సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ హారతి ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు విద్యార్థులు వేదమంత్రాలు పటిస్తూ నడవగా, వారి వెనుక మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటం, గురవయ్యల నృత్యం, దేవతా వేషధారణలో చిన్నారులు కదిలారు. ఈ వేడుకను చూసేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సత్యసాయి రథోత్సవంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ భక్తులు తమ తమ ప్రాంతాల సంప్రదాయ నృత్యాలతో అలరించారు. రథోత్సవంపై డ్రోన్ కెమరాతో పూల వర్షం కురిపించారు. పెద వెంకమరాజు కల్యాణ మండపానికి చేరుకున్న అనంతరం రథానికి రత్నాకర్, వేద పండితులు మంగళహారతి ఇచ్చి రథోత్సవాన్ని ముగించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరా రెడ్డి, మాజీ ఎంపీ మురళీ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ (మిగతా 6వ పేజీలో..)



సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రులు



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి అనగాని, నాయకులు



సాయి సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



వ్రతంలో పాల్గొన్న భక్తులు, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

నేడు ప్రధాని మోదీ రాక

హిల్ వ్యూ స్టేడియంలో వేడుకలు

సత్యసాయి సన్నిధిలో సచిన్, ఐశ్వర్య రాయ్

పుట్టపర్తికి చేరుకున్న సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్




పుట్టపర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పుట్టపర్తికి బుధవారం వస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. ప్రధాని ఉదయం 9.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. గవర్నర్ (మిగతా 6లో..)



హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాట్లు

తాగి.. ఊగుతున్నారు..

- కర్ణాటకలో మద్యపానం
- వాహనాల్లో వేగంగా.. రోడ్లకు అడ్డంగా వస్తున్న మందుబాబులు
- ప్రమాదాలకు కారణమవుతున్న వైనం



చిలమత్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులోనే మండలం ఉంది. కర్ణాటకలో మద్యంతాగి.. మండలానికి చెందిన యువకులు ఊగుతున్నారు. సరిహద్దు దాటి అవతలికి వెళ్లి పూటుగా మద్యం తాగుతున్నారు. అదే మత్తులో ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ మండలంలోకి వస్తున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్నారు. కిక్కు ఎక్కువైన కొందరూ.. రోడ్లకు అడ్డంగా వస్తూ.. వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారు. ప్రమాదాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమవుతున్నారు.

యువతే అధికం

మండలంలో గత ఆరు నెలల్లో 48 వరకు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. పట్టుబడిన వారిలో అత్యధికంగా యువకులే ఉండటం గమనార్హం. మండలానికి సరిహద్దుగా ఉన్న కర్ణాటకలోని బాగేపల్లిలో మద్యం తాగి వస్తూ కొడికొండ చెక్‌పోస్టులో పోలీసులకు పట్టుబడుతున్నారు. యువత.. స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకునేందుకు బాగేపల్లి వద్దకు వెళ్తున్నారు. అక్కడ మద్యం సేవించి ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మద్యం తాగడంతో పాటు ఒకే బైకలో ముగ్గురు, నలుగురు అతివేగంతో వస్తున్నారు. రోడ్డు దాటుతున్న వారిని గమనించకుండా దూసుకుపోతున్నారు. తద్వారా ప్రమాదాలకు కారణమవుతున్నారు.

మద్యం ప్రియులకు కేరాఫ్ బాగేపల్లి టీబీ క్రాస్

మద్యానికి అలవాటుపడిన వారు కర్ణాటకలోని టీబీ క్రాస్ హైవే ధాబాలకు వెళ్తున్నారు. అక్కడ పీకలదాకా తాగి వాహనాలు నడుపుకుంటూ ఇళ్లకు అతికష్టం మీద చేరుకుంటున్నారు. కర్ణాటకలో మద్యం ధరలు కొంతవరకు ఏపీలో కంటే తక్కువగా ఉండటంతో పాటు టీబీ క్రాస్ హైవేలో ఉన్న మద్యం దుకాణాల్లో కోరిన బ్రాండ్లు దొరుకుతున్నాయి. మద్యం సేవించడానికి అనుగుణంగా ధాబాలు ఉంటున్నాయి. అర్ధరాత్రి వరకు తాగినా అక్కడి పోలీసులు చర్యలు తీసుకోరు. దాంతో మద్యంప్రియులకు టీబీ క్రాస్, హైవే ప్రాంతాలు కేరాఫ్‌గా మారాయి.

తనిఖీలు చేస్తున్నా తగ్గని వైనం

కర్ణాటక నుంచి మద్యం తాగి వాహనాలు నడుపుకుంటూ వస్తున్న వారి కోసం స్థానిక పోలీసులు ఇటీవలిగా రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు కొడికొండ చెక్‌పోస్టులో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. ఊగుతూ వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. అయినా మందుబాబులు తగ్గట్లేదు. చిన్నచిన్న జరిమానాలతో సరిపుచ్చుకుంటుండటంతో వారిలో భయంలేకుండా పోతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



డ్రైవర్‌ను పరీక్షిస్తున్న ఎస్ఐ మునీర్ అహమ్మద్

తాగి వాహనాలు నడపవద్దు

మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదాలు కొనితెచ్చుకోవడమే అవుతుంది. మద్యం మత్తులో ఎదురుగా వచ్చే వాహనాలు, వ్యక్తులను ఢీకొట్టడం, రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఇబ్బందులు పెట్టడం వంటివి ఘోర ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాచేస్తే వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తాం.

- మునీర్ అహమ్మద్, ఎస్ఐ, చిలమత్తూరు

కన్నుల పండువగా తెప్పోత్సవం



చిత్రావతి నదిలో తెప్పోత్సవం

పుట్టపర్తి రూరల్: చిత్రావతి నదిలో మంగళవారం రాత్రి సత్యసాయి తెప్పోత్సవం కన్నుల పండుగగా జరిగింది. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పడవలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి నదిలో వేడుకను నిర్వహించారు. ఆర్‌జే రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. ఈ నెల 24 వరకు ప్రతి రోజూ తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. సప్తనక్షత్ర హారతులు, సప్తనాగ హారతులు, విశేష పూజలు కొనసాగుతాయి.

నేడు 170 పాఠశాలలకు సెలవు

కొత్తచెరువు: సత్యసాయి శత జయంతి వేడుకలకు ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలలోని 170 ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల సెలవు ఇచ్చామని డీఈఓ క్రిష్టప్ప తెలిపారు.

నేడు రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ

- పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ విడుదల

కొత్తచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు బుధవారం రైతుల ఖాతాల్లోకి జమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి రామూనాయక్ తెలిపారు. జిల్లాలో 2,65,040 మంది రైతులకు రూ.178.76కోట్లు మంజూరైందన్నారు. ఇందులో అన్నదాత సుఖీభవ కింద రూ.132.52కోట్లు, పీఎం కిసాన్ సొమ్ము రూ.46.24కోట్లు మంజూరైందన్నారు. ఈ మొత్తం బుధవారం రైతుల ఖాతాల్లోకి జమవుతుందన్నారు.

మహిళకు 14 నెలల జైలు శిక్ష

ధర్మవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు పాస్‌బుక్‌లో సర్వే నంబర్లు, భూమి ఎకరాల నంబర్లు ఫోర్జరీ చేసిన కేసులో మహిళకు 14నెలల జైలు శిక్ష విధిస్తూ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.వెంకటహరీశ్ మంగళవారం తీర్పునిచ్చారు. వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2017లో ధర్మవరం మండలం కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి సాలమ్మ అప్పటి తహసీల్దార్ మహబూబ్ బాషా విధులకు ఆటంకం కలిగించడంతోపాటు పట్టాదారు పాసుపుస్తకంలో సర్వేనంబర్లు, భూమి ఎకరాల నంబర్లను ఫోర్జరీ చేసింది. దీనిపై అప్పటి తహసీల్దార్ మహబూబ్‌బాషా.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అప్పటి ఎస్ఐ బీఎన్ సురేశ్ (ప్రస్తుతం పుట్టపర్తిరూరల్ సీఐ) కేసు నమోదు చేశారు. సాలమ్మను అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి వెంకటహరీశ్.. సాలమ్మకు 14నెలల జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధించారని ఇన్‌చార్జ్ సీఐ తెలిపారు.

చిన్నారిపై అత్యాచారయత్నం?

- పోలీసులకు ఫిర్యాదు.. పోక్సో కేసు నమోదు



తహసీల్దారుకు ఫిర్యాదు..

హిందూపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీలో తొమ్మిదేళ్ల చిన్నారిపై గోపి అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. చిన్నారి నాలుగో తరగతి చదువుతోంది. ఈనెల 17న గోపి తిరుపతి లడ్డూ ఇస్తానని చిన్నారిని ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు అత్యాచారానికి యత్నించాడు. దీంతో చిన్నారి కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీసింది. చుట్టుపక్కలవారు గమనించారు. చిన్నారి జరిగిన విషయాన్ని వారితో చెప్పింది. చిన్నారి కుటుంబికులు.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఆదినారాయణ తెలిపారు.

మహిళల నిరసన

చిన్నారిపై అత్యాచారయత్నాన్ని నిరసిస్తూ మహిళలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో పోలీసులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆ మేరకు డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు.



చామంతి తోటలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులు

విరుల తోటకు విద్యుత్ కాంతులు..

తోట మొత్తంగా విద్యుత్ దీపాలు.. ఇదేదో సినిమా సెట్టింట్ అనుకుంటే పొరబాటే. తోటే.. అచ్చంగా విరుల తోటే. చామంతి పూల తోటే. మంచు కురిసే వాతావరణంలోనూ పూల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు గాండ్లపెంట మండలానికి చెందిన ఓ రైతు చేసిన వినూత్న ఆలోచన ఇది. ప్రస్తుతం మంచు కురుస్తోంది. చలి విపరీతంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో మొక్కల ఎదుగుదల అంతంతమాత్రంగానే ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, చామంతి పూల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు దోరణాల వద్ద ఓ రైతు.. మూడెకరాల తోటలో మొత్తం ఇలా.. ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశాడు. ఆ వెలుతురులో మొక్కకు ఏపుగా పెరుగుతాయి. చామంతి పూలు కూడా ముందుగానే కోతలు పడి మంచి ధరలు వస్తాయని రైతు చెబుతున్నాడు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారి పక్కనే ఉన్న తోటలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయడాన్ని చూసి.. ఆ రహదారిలో వెళ్లేవారు ఆశ్చర్యపోతున్నారు.

- గాండ్లపెంట, ఆంధ్రజ్యోతి

గొర్రెలను కాపాడేందుకెళ్లి..
కిందపడి కాపరి మృతి

విషపు నీరు తాగి 24 మూగజీవాలు కూడా..


రామాంజినమ్మ (ఫైల్)

బెళుగుప్ప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విషం కలిపిన నీటిని తాగుతున్న గొర్రెలు, మేకలను కాపాడే ప్రయత్నంలో కాపరి బోర్లాపడి మరణించింది. మండలంలోని దుద్దేకుంట గ్రామం వద్ద మంగళవారం రామాంజినమ్మ(40) చనిపోయింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓబులేసు, రామాంజినమ్మ దంపతులకు 45 గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటిని మేపుకుంటూ జీవనం సాగించేవారు. మంగళవారం గ్రామ సమీపంలోని వన్నూరు స్వామి తోట వద్దకు మూగజీవాలను రామాంజినమ్మ తోలుకెళ్లింది. తోటలోని అరటి చెట్లకు పిచికారీ చేసేందుకు క్రిమి సంహారక మందులు కలిపి, డ్రమ్ములో నిల్వ ఉంచారు. మూగజీవులు మేత మేస్తూ దాహంతో ఆ నీరు తాగాయి. దీనిని గమనించిన రామాంజినమ్మ.. అవి చనిపోతాయన్న భయంతో పరుగులు తీసింది. పరుగెడుతూ బోర్లాపడి సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబ సభ్యులు రామాంజినమ్మను ఆత్మకూరు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో చనిపోయింది. 45 గొర్రెలు, మేకలుకు ఉండగా 24 చనిపోయాయి. దీంతో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రామాంజినమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

29న జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలు ఈనెల 29వ తేదీన ఆర్డీటీ స్టేడియంలోని ఏడీసీఏ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారి రిటైర్డ్ ఆర్డీఓ ఈశ్వర్ పర్యవేక్షణలో సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈనెల 24వతేదీన నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లిరోడ్డులోని ఏఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ సీడాప్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యం నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళాలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతిపైన చదివి, 18 నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీయువకులు మేళాకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9010039901 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వక్కలారీల పట్టివేత

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ అధికారుల తనిఖీలో నాలుగు వక్కల లారీలు పట్టుబడ్డాయి. గుత్తి టోల్ గేట్ వద్ద కర్ణాటక నుంచి వక్కలతో వస్తున్న ఈ వాహనాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశారు. సరుకు విలువ రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఇందుకూరు హేమ తెలిపారు. కాగా తనిఖీ చేసిన సందర్భంలో కాకుండా కొంత ఆలస్యంగా వేబిల్లులు అధికారులకు చూపించినట్లు తెలిసింది. మరి ఈ విషయంలో అధికారులు వక్కల జరిమానా విధిస్తారా..?లేక వే బిల్లు ఉన్న కారణంగా నిబంధనల మేరకు వదిలేస్తారా..?అనేది తేలాల్సి ఉంది.

హంద్రీనీవా కాలువ అభివృద్ధికి నాబార్డు రుణం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ అభివృద్ధి పనులకు రుణం ఇవ్వనున్నట్లు నాబార్డు ప్రాంతీయ అధికారి కావ్య తెలిపారు. హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్‌తో కలిసి ఆమె రెండురోజులపాటు ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులను పరిశీలించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మొత్తం నాబార్డు ద్వారా రూ.2100 కోట్ల రుణం ఇస్తామన్నారు. ఇప్పటికే రూ.1150 కోట్లు విడుదల చేశామన్నారు. త్వరలో మరో రూ.950కోట్లు ఇచ్చి, కాలువ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు కార్యక్రమంలో నాబార్డు కన్సల్టెంట్ కేశవయ్య, హంద్రీనీవా ఈఈలు శ్రీనివాస నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్యసేవే పరమావధి కావాలి

నూతన వైద్యవిద్యార్థులకు కలెక్టర్ సూచన


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం వైద్యం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్యసేవే పరమావధి కావాలని ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య కళాశాల, సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులందరూ సమయానికి విధుల్లో ఉండాలనీ, రోగుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు షారోన్ సోనియా పాల్గొన్నారు.


సత్యసాయి రథోత్సవం ముందు సాంస్కృతిక కార్యక్రమాలు




జయంత్యుత్సవాలకు హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


రథానికి పూజలు చేస్తున్న రత్నాకర్


రథాన్ని లాగుతున్న మంత్రులు


సత్యసాయి మహాసమాధి

వెండి రథంపై బంగారు సాయి

(5వ పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళల ద్వారా సమాజానికి సంస్కృతిని, సేవలను, ఆధ్యాత్మికతను పంచేందుకే సత్యసాయి 30 ఏళ్ల క్రితం, 1995లో శ్రీసత్యసాయి అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ప్రారంభించారు. ఏటా నవంబరు 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30వ అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని హిల్‌వ్యూ స్టేడియంలోనే నిర్వహిస్తున్నారు. దేశవిదేశాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఈ క్యాక్రమానికి హాజరుకానున్నారు.

హిల్‌వ్యూ స్టేడియం ముస్తాబు

హిల్ వ్యూ స్టేడియంలో బుధవారం జరిగే సత్యసాయ శత జయంతి వేడుకలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. వీవీఐపీలు కూర్చునేందుకు ఒక వేదిక, సాంస్కృతిక ప్రదర్శనలకు మరో వేదికను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం స్టేడియంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరు గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భక్తులు, అతిథులకు నారాయణ సేవ, తాగునీరు, వైద్యం, రవాణా.. ఇలా అన్ని సౌకర్యాలను కల్పించారు.

అలరించిన సురాంజలి

సత్యసాయి భక్తులు సురాంజలి పేరిట నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. సాయికుల్వంతు సభా మంటపంలో మంగళవారం రాత్రి అభి, కుమారి అంతరానంది బృందం సంగీత గాన కచేరి నిర్వహించింది. అనంతరం ట్రస్టు ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. సత్యసాయి ప్రేమతత్వంపై విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నారాయణ సేవను అందించారు.



నేడు ప్రధాని మోదీ రాక


మంత్రి లోకేశ్‌తో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ కరచాలనం


సత్యసాయి మహాసమాధి వద్ద నటి ఐశ్వర్యారాయ్

(5వ పేజీ తరువాయి)

అబ్దుల్ నజీర్, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ఆయనకు స్వాగతం పలుకుతారు. మధ్యాహ్నం 12.25 గంటల వరకూ వేడుకలలో పాల్గొంటారు. అనంతరం కోయంబత్తూరుకు వెళతారు. ప్రధాని పర్యటనకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. పుట్టపర్తికి వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు.

- సత్యసాయి స్మారకంగా రూ.100 నాణేన్ని, నాలుగు తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరిస్తారు. వంద మంది రైతులకు పాడి ఆవులను పంపిణీ చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదేళ్లలోపు బాలికలకు ఆర్థిక భరోసానిచ్చే బృహత్తర పథకాన్ని ప్రారంభిస్తారు. విద్య, వైద్య, సామాజిక రంగాల్లో సేకు సంబంధించిన మరో ప్రధానమైన పథకాన్ని ప్రధాని చేత సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆవిష్కరించే అవకాశం ఉంది.
- హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించే వేడుకలలో సుమారు 500 మంది వీవీఐపీలు పాల్గొంటారు. సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యా రాయ్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు.
- భద్రత కట్టుదిట్టం

శత జయంతి ఉత్సవాలకు బుధవారం లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాని పర్యటన ముగిసేదాకా పుట్టపర్తికి వచ్చే వాహనాలను బ్రహ్మణపల్లి, ఎనుములపల్లి, పడమర గేట్ మీదుగా మళ్లించారు. అనంతరం యథావిధిగా రాకపోకలు సాగించవచ్చు. కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీశ్ కుమార్, ట్రస్టు ప్రతినిధులు చక్రవర్తి, నాగానందం, ప్రసాద్, డాక్టర్ మోహన్, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే, కో ఆర్డీనేటర్ కోటేశ్వరరావు, ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు చలం, తెలంగాణ అధ్యక్షుడు వెంకట్రావు, ఏపీ అధ్యక్షుడు లక్ష్మణరావు సహా పలువురు సేవాదళ్ ప్రతినిధులు వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.

- ఘన స్వాగతం

సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మంగళవారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకున్నారు. విమానాశ్రయంలో వారికి రెవెన్యూ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, చీఫ్ సెక్రటరీ విజయానంద్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు పల్లె సింధూరా రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మెన్ పూల నాగరాజు, మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట్ల అంజనప్ప, వెంకటశివుడు యాదవ్ తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి షాదీ మహల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్ హౌస్‌లో బసచేశారు. మంత్రి లోకేశ్ కప్పలబండ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన టెంట్ హౌస్‌లో బసచేశారు.


సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో మాట్లాడుతున్న మంత్రులు లోకేశ్, అనగాని, పయ్యావుల

ఇది ఆత్మగౌరవ సీమ..!

రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవంలో నాయకులు


పప్పూరు రామాచార్యులు విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విద్యావంతుల వేదిక, ప్రజా కళామండలి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పప్పూరు రామాచార్యులు విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసమితి అధ్యక్షుడు టీవీ రెడ్డి పప్పూరు రామాచార్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమితి నాయకుడు రామాంజనేయులు కేక్ కట్‌చేసి, కార్యక్రమానికి 97వ రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవంగా నామకరణం చేశారు. నేడు రాయలసీమగా మనం పిలుచుకుంటున్న ఈ ప్రాంతాన్ని 1928కి ముందు దత్తమండలాలు అని పిలిచేవారని నాయకులు గుర్తు చేశారు. ఆత్మగౌరవానికి, తెగువకు, సాహసానికి పెట్టింది పేరు అయిన ఈ ప్రాంతాన్ని దత్త మండలాలు అని పిలవడం సరికాదని భావించిన ఆ నాటి నాయకులు చిలుకూరి నారాయణరావు.. సీమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా కొత్త ప్రతిపాదనను తెచ్చారని అన్నారు. 1928లో నంద్యాలలో నిర్వహించిన ఆంధ్ర మహాసభ సమావేశంలో దత్త మండలాలు పేరుకు బదులుగా రాయలసీమ అనే పేరుతో పిలవాలని ప్రతిపాదించారని అన్నారు. ఆయన ప్రతిపాదనను ఆమోదించేలా మాడభూషి హరిసర్వోత్తమరావు కృషి చేశారని అన్నారు. ఆ నాటి నుంచి ఏటా నవంబరు 18న రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, స్టార్ యూత్ ఫెడరేషన్ నాయకులు విశ్వనాథవర్మ, కులనిర్మూలన పోరాట సమితి నాయకుడు నల్లప్ప, సీపీఐ లిబరేషన్ నాయకుడు వేమన, ఐసా నాయకుడు అల్తాఫ్, ఓపీడీఆర్ జిల్లా నాయకుడు ప్రకాష్, రాయలసీమ విద్యార్థి నాయకులు సాయి, సునీల్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై కఠిన చర్యలు

డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

గుంతకల్లు ఏరియా ఆస్పత్రి సిబ్బందికి మెమోలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈర్ల భ్రమరాంబికాదేవి హెచ్చరించారు. డి.హీరేహాళ్‌కు చెందిన షేక్ తస్లీమాభాను, గడేహోతూరుకు చెందిన కవిత మాతృమరణాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల అనస్థీషియా ప్రొఫెసర్ నవీన్‌కుమార్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ రవికుమార్, గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ నిస్సార్ బేగంతోపాటు డీపీఎంఓ శ్రీనివాస రెడ్డి, పీఓఎస్‌డీ డాక్టర్ నారాయణస్వామి, హెచ్‌ఎన్‌ఓ ప్రమీలాదేవి ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులతో సమీక్షించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాతాశిశుమరణాల కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కవిత మరణానికి సంబంధించి గుంతకల్లు ఏరియా ఆస్పత్రి మెటర్నిటీ అసిస్టెంట్లు, స్టాఫ్‌నర్స్‌కు మెమోలు జారీచేయాలని డీసీహెచ్‌ఎస్‌కు సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

ఘనంగా టీడీపీ అర్బన్ క్లస్టర్, బూత్, డివిజన్ ఇన్‌చార్జిల ప్రమాణ స్వీకారం


కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు కష్టమొస్తే... అండగా ఉంటానని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ భరోసా ఇచ్చారు. ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చనీ, చిన్నచిన్న పొరబాట్లు ఉన్నా సరిదిద్దుకుని ముందుకెళ్దామన్నారు. నగరంలోని బళ్లారి బైపాస్ రోడ్డులోగల ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ, మండల ఇన్‌చార్జిల ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ జోన్ 5 ఇన్‌చార్జి, గుంటూరు మేయర్ రవీంద్ర, అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్బన్‌లో పార్టీ గెలుపునకు కష్టపడిన వారికి శిరసు వంచి నమస్కరిస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు ముందుంటానన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ... మేయర్ ఎన్నికల్లో అందరూ కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఏపీ మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ... పసుపు చొక్కా వేసుకుని పనిచేస్తుంటే.. వచ్చే ఆనందమే వేరన్నారు. తర్వాత 12 మంది క్లస్టర్లు, 12 మంది కో-క్లస్టర్లు, 56 మంది యూనిట్ ఇన్‌చార్జిలు, 56మంది కో-యూనిట్ ఇన్‌చార్జిలు, 277 మంది యూత్ కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు వెంటకశివుడు యాదవ్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, వందలాది మంది టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలంలో కృష్ణుడి విగ్రహం లభ్యం



గాండ్లపెంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లికి చెందిన వెంకటనారాయణ రెడ్డి పొలంలో శ్రీకృష్ణుడి రాతి విగ్రహం మంగళవారం బయటపడింది. పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా విగ్రహం బయటపడింది. ట్రాక్టర్ ట్రిల్లర్ తగిలి విగ్రహం మధ్యలోకి విరిగిపోయింది. పెద్దలతో చర్చించి, విగ్రహాన్ని ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని గ్రామస్థులు తెలిపారు.

మోదీకి సీమలో పర్యటించే హక్కు లేదు

రాయలసీమ రాష్ట్రసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కుంచం

అనంతపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు న్యాయం చేయలేని ప్రధాని మోదీకి ఈ ప్రాంతంలో పర్యటించే హక్కు లేదని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆర్టికల్-3 ప్రకారం ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీకి పంపిన బహిరంగ లేఖను ఆయన విడుదల చేశారు. కుంచం మాట్లాడుతూ.... చిన్న రాష్ట్రాలకు మద్దతు తెలుపుతున్నట్లు బీజేపీ కాకినాడలో తీర్మాణం చేసిందనీ, ఆ మాటను నిలుపుకోలేదని విమర్శించారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం అంశాన్ని పార్లమెంటులో ఏపీ పాలకులు ఎందుకు ప్రస్తావించడంలేదని ప్రశ్నించారు. రాయలసీమకు ఏం చేశారని ప్రధాని మోదీ పుట్టపర్తి పర్యటనకు వస్తున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాయలసీమలో ఉండాల్సిన పరిశ్రమలన్నింటినీ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న మోదీకి ఈ ప్రాంతంలో పర్యటించే హక్కులేదన్నారు. రాయలసీమకు స్టీల్ ప్లాంట్, రాజధాని వంటివేవీ ఇవ్వకుండా ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పుట్టపర్తికి వస్తున్న తరుణంలో ఇప్పటికైనా కూటమి నేతలు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. 2029లోపు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయకపోతే.. 2029 ఎన్నికల్లో ఏ పార్టీకీ రాయలసీమ వాసులు మద్దతు తెలపకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ రాష్ట్ర సమితి మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు సాదర్ వలి, జిల్లా నాయకుడు ముస్కిన్ పాల్గొన్నారు.


లేఖను విడుదల చేస్తున్న కుంచం

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేయడానికి వెళ్తున్న భక్తులు

కదిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా కుమ్మరవాండ్లపల్లిలోని స్తోత్రాద్రి కొండ చుట్టూ స్వామివారి భక్తులు మంగళవారం గిరిప్రదక్షిణ చేశారు. మొదటగా స్వామివారి భక్తులు లక్ష్మీనరసింహ స్వామి వారి తూర్పు రాజగోపురం వద్ద నుంచి బయల్దేరారు. శ్రీవారు వెలసిన స్తోత్రాద్రికి హారతి ఇచ్చిన అనంతరం హరినామ కీర్తనలు, గోవింద నామస్మరణతో శ్రీవారి స్తోత్రాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు, పట్టణ ప్రముఖులు, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా సమితి సభ్యులు రజనీకాంత్, ధర్మారెడ్డి, నంగి లక్ష్మీరెడ్డి వారి మిత్రబృందం తీర ప్రసాదాలు, అల్పాహారం, మంచినీరు, మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ స్తోత్రాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ కోసం రహదారిని ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమం

● హాజరుకానున్న మంత్రి, పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గొట్లూరులో బుధవారం పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ పథకంపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ హాజరవుతు న్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మండలంలోని రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

● తనకల్లు: కదిరి అగ్రికల్చరల్ రీసర్చ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఏడీ భారతి తెలిపారు. మండల రైతులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ



చెక్కును అందిస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయిన మండల పరిధిలోని మలకవేముల గ్రామానికి చెందిన బండి రూపేంద్ర ఇటీవల మిద్దెమీది నుంచి పడి మృతిచెం దాడు. ఆయన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో, పార్టీ నుంచి రూ.5 లక్షలు ప్రమాద బీమా మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం ధర్మవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా మృతుడి తండ్రి బండి మల్లికార్జునకు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ముదిగుబ్బ నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, కోట్ల_బాబి, వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జితో ఇబ్బందులు

● రైల్వే జీఎంకు వినతి

కొత్తచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి పెనుకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని దక్షిణ మధ్య రైల్వే జీఎం ముఖుల్‌చరణ్ మాతూర్‌కు మానవహక్కుల సంఘం నాయకులు పాపన్న విన్నవించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్‌లో రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేశారు. వర్షాలు వచ్చినప్పుడు ఈ బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉంటోందని తెలిపారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు దారిలేక ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రైల్వే బ్రిడ్జి వద్ద విద్యుత్ లైట్లు లేకపోవడంతో చాలా మంది వాహనదారులు చీకటిలో ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు.

సమావేశ మందిరం ప్రారంభం

బుక్కపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమందిర ని ర్మాణానికి సుష్మ తంగెళ్ల, శ్రీనివాస్ తంగెళ్ల దంపతులు ఆర్థిక సాయం అందజేశారు. వారు రెండేళ్లుగా పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ స్థులు మందిరానికి గ్రామం తరఫున రూ.50 వేలు సమావేశ మందిరానికి విరాళం ప్రకటించారు.

అసభ్యంగా ప్రవర్తించాడని మహిళ ఫిర్యాదు

తనకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తనతో అసభ్యంగా ప్రవర్తించాడని మండలానికి చెందిన ఓ మహిళ మంగళవారం ఓ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తను ఇంటివద్ద ఉండగా, గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం మత్తులో వచ్చి తనను చేయిపట్టి లాడని ఫిర్యాదులో పేర్కొంది. గతంలోనూ అతడు తన పట్ల ఇలాగే ప్రవర్తించినట్లు పోలీసులకు, కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేసి, కేసు నమోదు చేయనున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రామాంజినేయులు తెలిపారు.

దాడిచేశారని మరొకరు...

తనకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తనపై తమ గ్రామానికి చెందిన శ్రీనివాసులు దాడి చేశాడంటూ మండలంలోని ముత్యాల వారిపల్లికి చెందిన శ్రీనివాసులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈవిషయంపై విచారించి, కేసు నమోదు చేయనున్నట్లు హెడ్‌కానిస్టుబుల్ రామాంజనేయులు తెలిపారు.

తోపులాటలో మహిళ మృతి



శాంతాబాయి మృతదేహం

ముదిగుబ్బ, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన ఇరువర్గాల తోపులాటలో ఓ మహిళ మృతి చెందింది. మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డులో టెంకాయల వ్యాపారం, కూల్‌డ్రింక్ షాప్ నిర్వహించే నరసింహనాయక్ భార్య శాంతాబాయి(55), ఆమె కుమారుడు రమేష్ నాయక్ ఏడాది క్రితం అనంతపురంలో నివాసం ఉండేవారు. అప్పుడు నవోదయ కాలనీకి చెందిన రామకృష్ణతో రూ. 30వేలు అప్పు తీసుకున్నారు. ఆ సొమ్ము కోసం రామకృష్ణ మంగళవారం రాత్రి తన అనుచరులతో ముదిగుబ్బకు వచ్చాడు రమేష్ నాయక్ కు టుంబ సభ్యులతో ఘర్షణకు దిగాడు. ఆ ఘర్షణ సందర్భంగా జరిగిన తోపులాటలో శాంతాబాయి అస్వస్థకు గురైంది. కుటుంబ సభ్యు లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఇస్మాయిల్ తెలిపారు. మృతికి పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ ←

సత్యసాయిబాబా శతజయం త్యుత్సవాల్లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ నారా లోకేష్ పుట్టపర్తికి చేరుకున్నారు. వారికి పుట్టపర్తి విమానాశ్రయంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు ఘన స్వాగతం పలికారు.

-పుట్టపర్తి టౌన్,(ఆంధ్రజ్యోతి)



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కందికుంట



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె, పరిటాల శ్రీరామ్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి

శతజయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



పడమటి గేట్ వద్ద పార్కింగ్ స్థలం



సత్తెమ్మ గుడి వద్ద వైద్య శిబిరం

పుట్టపర్తి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లను చేపట్టింది. ఇందులో బాగంగా పుట్టపర్తి పట్టణం నుంచి తొమ్మిది కిలోమీటర్ల వరకు తొమ్మిది పార్కింగ్ స్థలాలను, ఏడు వైద్య శిబిరాలను, ఏడు సమాచార కేంద్రాలను ఏర్పాటుచేసింది. సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద, సందీప్ బెల్లివ్, శిల్పారామం, ఆనంద్‌విల్లాస్, శ్రీసత్యసాయి బాలవికాస్, పెద్దకమ్మవారిపల్లి పోతలప్పస్వామి గుడి, కర్ణాటక నాగేపల్లి, కమ్మవారిపల్లి రోడ్‌లోని ఎస్‌ఎస్‌ఎస్ ఇంగ్లీషు మీడియం స్కూల్, కర్ణాటక నాగేపల్లి కింగ్స్ చర్చి వెనుక, సాయినగర్‌క్రికెట్ గ్రౌండులో పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేశారు. అలాగే వైద్య శిబిరాలను గోకులం, చిత్రావతి బ్రిడ్జి, ఆర్టీసీ బస్టాండ్, చిత్రావతి హారతిఘాట్, ఎనుములపల్లి పీహెచ్‌సీ, సత్యసాయి ఎయిర్‌పోర్టు, మున్సి పల్ కార్యాలయం, రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేశారు. అదేవిధంగాఇఇ సమాచార కేంద్రాలను రమేష్‌విల్లాస్, ఆర్టీసీ బస్టాండ్, కర్నాటక నాగేపల్లి, చిత్రావతి హారతి ఘాట్, సత్యసాయి పార్క్, పెద్దకమ్మ వారిపల్లి జంక్షన్, హైవే కట్‌పా యింట్, గణేష్ సర్కిల్, ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్‌లలో ఏర్పాటు చేసింది. సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు.

గ్రంథాలయాల్లో వ్యాసరచన పోటీలు

ధర్మవరం/కొత్తచెరువు/నంబులపూలకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): .పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాల య వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచ న, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'గ్రంథాలయాల ప్రాముఖ్యత-సమాజంలో వాటి పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి అంజలిసౌభాగ్యవతి తెలిపా రు. అదే విధంగా కొత్తచెరువు, నంబులపూలకుంట గ్రంథాలయాల లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వారోత్సవాల ముగింపు అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

'దళిత, గిరిజనులపై పెరిగిన దాడులు'

తనకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ సీపీఐ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, ఆత్మగౌర వం కోసం దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తున్నామన్నారు. జనగణనలో కులగణన చేపట్టాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టాక దళిత, గిరిజనులు, మైనార్టీలపై దాడులు మితిమీరాయన్నారు. సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు రెడ్డెప్ప, నీరంజన్, సుధాకర్, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేపట్టిన శ్రీనివాసులు

బత్తలపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గంటాపురానికి చెందిన శ్రీనివాసులు మంగళవారం అయోధ్యకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. మండలంలోని గంటాపురం గ్రామంలో దాతల సహకారంతో రామాలయం నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు అయినా నిర్మాణం పూర్తి కాలేదు. గ్రామంలో రామాలయం నిర్మాణం త్వరగా పూర్తయితే సైకిల్‌పై అయోధ్యకు వస్తానని గ్రామానికి చెందిన శ్రీనివాసు లు అయోధ్య రాముడికి మొక్కుకున్నాడు. అనంతరం ఆలయం నిర్మాణం పూర్తి అయి 45 రోజుల క్రితం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దీంతో శ్రీనివాసులు శ్రీరాముడి మాల ధరించి అయోధ్యకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు శ్రీనివాసులును భజనలు చేసుకుంటూ గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నెట్టెం అశోక్, బోయపాటి అప్పస్వామి, సందీప్, వెంకటేశ్, మాల్యవంతం బాబు, చిట్టి, బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆత్మకూరు యువతి

తాడిమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరుకు చెందిన మందల ఈరప్ప కుమార్తె పావని భారత జాతీయ బాల్ బాడ్మింటన్ జట్టుకు ఎంపికైంది. ఈ మేరకు బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రాజారావు నుంచి ఆమెకు సోమవారం ఉత్తర్వులు అందాయి. నేపాల్‌లో 2026 జనవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగే బాల్‌బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో తాను ఫ్రంట్ ప్లేయర్‌గా పాల్గొననున్నట్లు మందల పావని తెలిపారు. తమ కుమార్తె జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉత్తర్వులు అందడంతో తల్లిదండ్రులు శివమ్మ, ఈరప్ప ఆనందం వ్యక్తంచేశారు.

పోలీసులకు చోరీ కేసు నిందితుడి అప్పగింత

తనకల్లు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కేబుల్ చోరీకి సంబంధించి ఓ నిందితుడిని మంగళవారం తనకల్లు, రాచువారిపల్లి రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలకేంద్రమైన తనకల్లు, రాచువారిపల్లి, కోటూరు, పరాకువాండ్లపల్లి, బత్తినవారిపల్లి, మండ్లిపల్లి తదితర గ్రామాల్లో నెలరోజులనుంచి వ్యవసాయ కేబుల్ చోరీ అవుతోంది. రైతులు తీవ్ర ఆందోళన చెందారు. వారు తనకల్లులోని గుజిరీ వ్యాపారులను సంప్రందించి తమ సమస్య తెలిపారు. ఎవరైనా రాగివైర్లు అమ్మడానికి వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. అన్నమయ్య జిల్లాలోని కొత్తకోటకు చెందిన శంకర్ అనే వ్యక్తి మంగళవారం తనకల్లులో శివరామిరెడ్డికి చెందిన గుజిరీ దుకాణంలో రాగివైర్ అమ్మేందుకు వచ్చాడు. ఆ గుజరీ వ్యాపారి ఈ విషయంపై రైతులకు సమాచారం ఇచ్చాడు. దీంతో తనకల్లు, రాచువారిపల్లికి చెందిన 30 మంది రైతులు గుజిరీ వ్యాపారి వద్దకు వచ్చి రాగివైరు అ మ్ముతున్న శంకర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విష యంపై రైతులు శేఖర్‌రెడ్డి, మీయాసాబ్, శివారెడ్డి, దస్తగిరి, సుధాకర్, త్రిబోజ్, తదితరులు తాము విడివిడిగా ఫిర్యాదు చేస్తామని కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పూర్తి విచారణ చేసి, న్యాయం చేస్తామని పోలీసులుహామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగి వెళ్లారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

ఓబుళదేవరచెరువు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణంలో మంగళవారం ఆశాది పవన్ దంపతులు అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. 250 మంది అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజినేయనాయుడు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

ధర్మవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి విద్యాసామగ్రిని పంపిణీచేశారు. పాఠశాలలో ఇంగ్లీసు టీచర్ కేవీ నాగిరెడ్డి ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాల లోని 36 మంది విద్యార్థులకు అందజేశారు. అనంతరం 500 మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు.

మహాసభలను విజయవంతం చేయండి

● ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కదిరి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ 25వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కదిరిలో పోస్టర్లు ఆవిష్కరించారు. డిసెంబరు 12 నుంచి 14 తేదీ వరకు తిరుపతిలోని ఇందిరా మైదానంలో ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

నల్లమాడ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎన్ బండవాండ్లపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ఉలవలను రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ అబ్దుల్‌హక్ తెలిపారు. కావల్సిన రైతులు రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలన్నారు. ఆయనతోపాటు రైతు సేవాకేంద్రం సిబంది నారాయణస్వామి, శిరీషా, టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణంనాయుడు, మైలే రామచంద్ర, డి. బాలిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఓడీసీలో నేటి నుంచి పంపిణీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలలో బుధవారం నుంచి సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి షేక్ ఇలియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో పట్టదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. రైతుల వెంట సెల్ ఫోన్ తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే



పుట్టపర్తి టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇతర ప్రముఖులు రానున్న సందర్భంగా మంగళవారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక పనులను మంత్రుల బృందం పరిశీలించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పరిశీలించారు. వారు హిల్‌వ్యూ స్టేడియంలో జరుగుతున్న పనుల పురోగతిపై రాష్ట్ర నోడల్ అధికారులు టి.కృష్ణబాబు, జి.వీరపాండ్యన్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, డీఐజీ షిమోషి భాజ్పై, ఆర్డీఓలు మహేష్, సువర్ణ, వీవీఎస్ శర్మ, ట్రస్టు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



సహకార సంఘ కార్యాలయంపై జెండా ఎగురవేస్తున్న దృశ్యం

నల్లమాడ, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం అఖిలభారత సహకార వారోత్సవాలను సహకార సంఘం అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సబ్‌డివిజన్ అధికారి శివకుమార్ హాజరయ్యారు. సహకార సంఘం కార్యాలయంలో మొదటగా జెండా ఆవిష్కరించారు. సీఈఓ కేశప్ప, ఆదినారాయణ , శ్రీరాములు, డైరెక్టర్లు గంగులప్పనాయుడు, నాగేనాయక్, టీడీపీ నాయ కులు బుట్టి నాగభూషణంనాయుడు తోట్లో మంజునాథ్‌రెడ్డి, కేశవ, మైలే రామచంద్ర, అరవింద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

● అభివృద్ధి పనులపై చర్చ

ముదిగుబ్బ, నవంబరు, 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపైన చర్చించారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ఉపాధి హామీ పథకం, రహదారుల మరమ్మతులు, సిమెంటు రోడ్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, వైస్ ఎంపీపీలు వెంకటరెడ్డి, కృష్ణమ్మ, కోఆప్షన్ సభ్యుడు బాలముని, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఎంఈఓ శ్రీనివాస భాస్కర్

మడకశిర టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యంగా బోధన సాగాలని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బోధన ప్రక్రియ పర్యవేక్షణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 40 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు బోధన ప్రక్రియ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా..? అన్న అంశంపై పర్యవేక్షన ఉండాలన్నారు. బోధన సక్రమంగా అందేవిధంగా కృషి చేయాలన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు



పెనుకొండ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేరుకే నగర పంచాయతీ. ఇంటి, నీటి గుత్త వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలోలేదన్న రీతిలో ఉంది. పట్టణంలోని ఆల్విన్ కాలనీలో నిత్యం మురుగు నీరు రోడ్డుపైనే వెళ్తోంది. దీంతో వీధంగా దుర్వాసన వెదజల్లుతోంది. పలు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వీధి వెంట రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయినా నగర పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గర్భిణులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ముస్లింలు

సోమందేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణులకు ముస్లింలు అన్నదానం చేశారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో ఏడాదిగా పట్టణానికి చెందిన ముస్లింలు ప్రతినెలా మూడో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అయిషా తస్లీం, పర్యవేక్షకులు రవీంద్ర, మైనార్టీ నాయకులు అక్రంబాష, ముస్లింలు షెక్షా, జామియ మసీదు ముతువల్లి మహ్మద్, కార్యదర్శి కుల్లాయప్ప, గూని కుల్లాయప్ప పాల్గొన్నారు.

నేడు గుడిబండకు ఎమ్మెల్యే

మడకశిరటౌన్/గుడిబండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం దేవరహట్టి గ్రామ సమీపంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప తెలిపారు. దేవరహట్టి గ్రామ సమీపంలో బుధవారం చిత్రశేఖర్ తోటలో రైతులతో సమావేశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు రైతుల ఖాతాలో జమ చేస్తున్న సందర్భంగా సమావేశం నిర్వహించడం జరుగుతోందన్నారు. రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

● **చిలమత్తూరు:** ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండో విడతగా అన్నదాత సుఖీభవ నిధులను బుధవారం రైతుల ఖాతాల్లోకి జమ చేస్తోంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ఏఓ కవితారాణి పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పీఏ వీరయ్యతోపాటు డివిజన్ స్థాయి వ్యవసాయశాఖ అధికారులు హాజరవుతారన్నారు.

బంగారు గొలుసు అపహరణ

పరిగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పైడేటి గ్రామంలో నివసిస్తున్న సుజాతమ్మ మెడలో బంగారు గొలుసును అపహరించుకెళ్లినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. భర్త రాజశేఖర్‌రావు పూలు తీసుకురావడానికి బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో దుండగులు ఇంట్లోదూరి మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని ద్విచక్రవాహనంలో ఉడాయించారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20 మేకలు..

సుబ్బరాయనపల్లికి చెందిన హరిజన సంజీవప్పకు చెందిన 20మేకలు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఇంటివద్ద ఉన్న రొప్పంలో మేకలను ఉంచామని మంగళవారం ఉదయం లేచిచూడగా 30మేకలలో 20మేకలు మాయమైనట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ అయిన మేకల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాత్రగానిపల్లికి చెందిన రవి(18) ఈనెల 10న కడుపునొప్పి తాళలేక విషంతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన కుటుంబీకులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. తండ్రి మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు.

తుమ్మల మారెమ్మకు పూజలు



గుడిబండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా మంగళవారం అమ్మవారికి విశేషాలంకరణచేసి పూజలునిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం











సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



మంత్రి నారాలోకేశ్‌తో కలిసి వెళ్తున్న కొల్లకుంట అంజినప్ప, గుండుమల



నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

కులగణన చేపట్టాలి: సీపీఐ



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సోమందేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ జనగణనలో కుల గణన చేపట్టాలని సీపీఐ నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రెడ్డి శేఖర్‌కు వినతిపత్రాన్ని అందించారు. నాయకులు బాలస్వామి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని జాతీయ పార్టీ పిలుపుమేరకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగ హక్కుల హరణం, అప్రజాస్వామిక పాలన కొనసాగుతుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ సీపీఐ తరుపున పోరాటం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, చాంద్‌బాష, అంజినమ్మ, శిలా నారాయణస్వామి, నాగరాజు, శ్రీకాంత్, చంద్రశేఖర్, బాబాజాన్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన టీచర్లతో ఎంఈఓ

హిందూపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో టీచ్ టు సెలెక్టెడ్ ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఉపాధ్యాయులు బోధించే సమయంలో ఎలాంటి పద్ధతులు అవలంభించాలి..? లీప్ యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలి..? తదితరాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, హెచ్‌ఎం సామ్రాజ్యం, రీసోర్స్ పర్సన్‌లు రాజు, జగదీశ్, సిద్దగిరి శ్రీనివాస్, రాజశేఖర్, మాధవి పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం నిర్వహించారు. పీఓ కాంతరావు ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించి చెట్లకు పాదులుచేసి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని రోగాల బారి నుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరీష్‌బాబు పాల్గొన్నారు.

‘మత్తు రహిత సమాజమే లక్ష్యం’



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మత్తు రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సూపరింటెండెంట్ అనీల్, జియావుల్లా పేర్కొన్నారు. మంగళవారం హిందూపురంలోని పలు కళాశాలల్లో నషాముక్త్ భారత్ అభియాన్ ఐదేళ్ల వేడుకల్లో భాగంగా భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సామాజికన్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ అమృత్‌సర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నేటి యువత ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకెళ్లాలన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. మత్తు పదార్థాల బారినపడితే ఆ కుటుంబాలు వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. తల్లిదండ్రులు ఎంతోకష్టపడి పిల్లల్ని భవిష్యత్తుకోసం తరలిస్తే వారు మత్తుపదార్థాలకు బానిసై కుటుంబాలకు తీరని క్షోభ నిలుపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఈగల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ అశ్వర్థనారాయణ, సుందరేశన్, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీపీ మరింత చురుగ్గా పనిచేయాలి

ఎమ్మెల్యే బాలకృష్ణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఐటీడీపీ సభ్యులు

హిందూపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా ఉన్న ఐటీడీ పీ వింగ్ మరింత చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంవద్ద ఐటీడీపీ వింగ్‌తో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ ఆగడాలను ఎండగట్టారని, ఇప్పుడు కూడా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లి వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ప్రతిపక్ష పార్టీ కుట్రలను వక్తిగతంగా కాకుండా రాజకీయ పరంగా చూడాలన్నారు. సాంకేతికంగా మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, నియోజకవర్గ ఇన్చార్జ్ నజీర్, అనీల్, బాబాఫకృద్దీన్, ప్రసన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



రొద్దంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రొద్దం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రొద్దంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్, గ్రంథాలయ ఆవశ్యకతపై పోటీలు జరిగాయి. గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులను ప్రదానం చేస్తారని గ్రంథాలయ అధికారి నాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణమ్మ, టీచ్ కాన్వెంట్ ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

● రొళ్ల: జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, హెచ్‌ఎం రవికృష్ణ, ఉపాధ్యాయులు హెంజేరప్ప, సిబ్బంది గోపాల్‌రాజు పాల్గొన్నారు.

● చిలమత్తూరు: స్థానిక పొట్టి శ్రీరాములు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వపు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి మల్లికార్జున తెలిపారు.

నేటి నుంచి ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ వారోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 25వతేదీ వరకు నిర్వహించనున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. అందుకు సన్నాహాల్లో భాగంగా మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని పురాతన కారాగారాన్ని ఆయన పరిశీలించారు. కారాగారంలో పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయించారు. అనంతరం పెయింటింగ్ పనులను పరిశీలించారు. పురాతన కట్టడాలను వారసత్వంగా భద్రపరిచి, ప్రజలకు తెలియజేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

సత్యసాయి జయంత్యుత్సవాలకు తరలిన భక్తులు

రొద్దం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం సాయంత్రం రొద్దం మండలంలోని 63 గ్రామాల నుంచి 30 బస్సుల్లో భక్తులు వెళ్లారు. రాత్రి లేజర్‌షోను తిలకించి బుధవారం ప్రధాని మోదీ సభలో వీరు పాల్గొననున్నారు. సత్యసాయి ట్రస్ట్ భక్తులు రవిశంకర్, శివశంకర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాయిసేవలో చిన్నప్పరెడ్డిపల్లి భక్తులు

చిలమత్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా చిలమత్తూరు మండలం చిన్నప్పరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భక్తులు సాయి సేవలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సాయి సేవా భజన బృందం పుట్టపర్తికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌లో దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు వారు అన్న ప్రసాదాలను, తాగునీరుని అందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

రొద్దం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియంలో అండర్-17 బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఇందులో తురకలాపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రవీణ్, సాయి, రాజ్, దీక్షితరెడ్డి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు గోదావరిజిల్లాలోని భీమవరంలో జరగనున్న పోటీల్లో పాల్గొనను న్నారు. వీరి ఎంపికపట్ల హెచ్‌ఎం వెంగప్ప, పీడీ రామక్రిష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

పరుగు పోటీల్లో ప్రతిభ



మడకశిర టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పరుగుపందేనికి మడకశిర కేజీబీవీ విద్యార్థిని ఆర్ దీక్ష ఎంపికైనట్లు పీఈటీ అనిత తెలిపారు. అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అండర్-17 విభాగ 800 మీటర్ల పరుగుపందెంలో దీక్ష ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. కేజీబీవీ ఎస్ఓ చాందిని, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థిని అభినందించారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి

సీపీఎం నాయకుల డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇల్లులేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, ప్రవీణ్, బాబావలి, గంగాధర్, వెంకటరాముడు ఆధ్వర్యంలో నిరసన సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇల్లులేని నిరుపేదలందరికీ ఇంటిపట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారం చేపట్టి 20నెలలు గడుస్తున్నా హామీఇంత వరకు నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పెనుకొండ పట్టణంలో సర్వేనంబరు 668లో ఇల్లులేని పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వాటిని బలవంతంగా తొలగించారన్నారు. తాము కోర్టును ఆశ్రయిస్తే కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ప్రజాపోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, ఇళ్లస్థలాల పోరాట సభ్యులు సౌమ్య, అర్చన, అంజినప్ప, కొల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

సెలవు రోజులు మినహాయించాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

గోరంట్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో సెలవు రోజులు మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు రామాంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు ఉన్నతపాఠశాలను వారు సందర్శించి, సభ్యత్వనమోదు చేపట్టారు. వందరోజుల ప్రణాళికనుంచి రెండవ శని, ఆదివారాలు, సంక్రాంతి సెలవులు తొలగించాలన్నారు. విరామం లేనిచదువుల వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రనాథ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్, హెచ్‌ఎం రామాంజులు, విజయ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సోమందేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బహుజన చైతన్యవేదిక మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సోమందేపల్లి మండల అధ్యక్షుడిగా మంచేపల్లి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా పెయింటర్ రామాంజినేయులు, కార్యదర్శిగా పందిపర్తి మూర్తి, ఉపాధ్యక్షుడిగా సంజీవరాయుడు, నర్సింహమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా గోపీ, కుమార్, నర్సింహులు, సంయుక్త కార్యదర్శిగా నాగేంద్ర, మీడియా ఇన్‌చార్జిగ పందిపర్తి శ్రీనివాసులు, ప్రచారకార్యదర్శిగా తిప్పన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర అధ్యక్షుడు శివరామక్రిష్ణ మాట్లాడుతూ.. బహుజన సమస్యలపై కమిటీ నాయకులు రాజీలేని పోరాటం చేయాలన్నారు. ప్రజల ప్రశంసలు అందుకునేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగేపల్లి నాగరాజు, రాష్ట్ర గౌరవ సలహాదారుడు బాబు, జిల్లా నాయకులు రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్స్, అప్లికేషన్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమెస్ట్రీ హానర్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయప్ప మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 21వ తేదీలోపు కళాశాలలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9989375369, 8074793679కు సంప్రదించాలన్నారు.